క్లుప్తంగా

మలేషియా వర్సిటీతో మహిళా వర్సిటీ ఒప్పందం



వీసీ భారతికి ఒప్పంద పత్రాలు అందజేస్తున్న యూఎంకే వీసీ రజ్లీబిన్ చే రజాక్

తిరుపతి సిటీ : యూనివర్సిటీ ఆఫ్ మలేషియా కెలాంతన్(యూఎంకే)తో శ్రీపద్మావతి మహిళా వర్సిటీ పలు అంశాలపై ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం మలేషియాలో బయో ఇంజినీరింగ్‌పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వీసీ డి.భారతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళా వర్సిటీ విద్యార్థులు పోటీ ప్రపంచంలో దీటుగా రాణించేలా ఇండస్ట్రియల్ విజిట్, ఇంటర్న్‌షిప్, స్టాఫ్ మొబిలిటీ, టీచింగ్, పరిశోధనలో పరస్పరం సహాయ సహకారాలు అందించుకునేందుకు మలేషియా వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్, డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రోత్సహించడంలో రెండు వర్సిటీలు సమన్వయంతో పనిచేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం వీసీ భారతికి యూఎంకే వీసీ డాక్టర్ రజ్లీబిన్ చే రజాక్ ఒప్పంద పత్రాలను అందజేశారు. సదస్సులో ప్రొఫెసర్లు సువర్ణలతాదేవి, జయమాధురి, విజయకుమారి పాల్గొన్నారు.

పీజీ పరీక్షల వాయిదాకు వినతి



వినతి పత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఎస్ఐ ఉద్యోగాల కోసం ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన పీజీ విద్యార్థులకోసం వచ్చేనెల మొదటి వారంలో నిర్వహించనున్న పరీక్షలను వాయిదా వేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నేత ప్రేమ్ కుమార్ కోరారు. బుధవారం వీసీ రాజారెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రిలిమ్స్ నెగ్గిన విద్యార్థులు ఈ నెల 15వరకు పోలీస్ ఈవెంట్స్‌లో పాల్గొనవలసిఉందన్నారు. అదే తేదీల్లో పీజీ పరీక్షలు ఉన్నందున వాయిదా వేయాలని కోరామని తెలిపారు. వీసీ సానుకూలంగా స్పందించారని ఈవెంట్స్‌కు హాజరైయ్యే విద్యార్థులకు 20వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు హామీ ఇచ్చారని వెల్లడించారు.

వృత్తే దైవమని చాటండి!



■ నాపేరు వీ.రామమూర్తి. వెత్తలతుడుకు ఏపడబ్ల్యా సర్పంచ్‌ని. మా పెద్దలు చూపిన చాటల తయారీ వృత్తినే దైవంగా భావించి జీవిస్తున్నాం. ఈ వృత్తిద్వారా సంఘంలో గౌరవంగా బతుకుతున్నాం. గత సర్పంచ్ ఎన్నికల్లో నిలిచి సర్పంచ్‌గా గెలుపొందాను. నేను సర్పంచ్ అయినా.. మా కుటుంబం అంతా ఇప్పటికీ చాటల తయారీతోనే జీవనం సాగిస్తోంది.



■ మా ఊరు నారాయణవనం మండలం, వెత్తలతదుకు ఆదిఆంధ్రవాడ. నా పేరు వీ.దేవి. గత 40 ఏళ్లుగా మా గ్రామంలో చాటల తయారీనే వృత్తిగా జీవిస్తున్నాం. గతంలో మా పెద్ద వాళ్లు అడవులకెళ్లి వెదురును తెచ్చి చాటలు తయరు చేసేవాళ్లు. ఫారెస్టు వాళ్లు అడ్డుకోవడం వల్ల ఇప్పుడు పుత్తూరులో వెదురు కొని చాటలు తయారు చేసి అమ్ముతున్నా.

కొందరు కుల వృత్తిని చెప్పడానికి నమోషీగా ఫీలవుతుంటారు. మరికొందరు తమ వృత్తి ఏంటని అడగగానే మాట దాటేస్తుంటారు. కానీ నారాయణవనం మండలం, వెత్తలతదుకు ఆదిఆంధ్రవాడ వాసులు మాత్రం కుల వృత్తినే దైవంగా భావిస్తున్నారు. తరతరాలుగా నమ్ముకున్న వృత్తినే నేటికీ కొనసాగిస్తున్నారు. ఆధునిక ప్రపంచంతో పోటీ పడుతూ ప్రాచీన వృత్తికి జీవం పోస్తున్నారు. మానవ జీవితంలో నిత్యావసర వస్తువైన వెదురు చాటలు అల్లుతూ తమ బతుకులకు ఎదురు లేదని చాటిచెబుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో మరింత ముందుకు దూసుకుపోతున్నారు.

- వెదురు చాటల తయారీతోనే జీవనం
- గ్రామంలో 90 శాతం మందికి ఇదే వృత్తి
- సర్పంచ్ కుటుంబానికీ ఇదే జీవనాధారం
- తమిళనాడు, పాండిచ్చేరికి ఎక్కువగా ఎగుమతి

నారాయణవనం: నారాయణవనం మండలం, వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ వాసులకు వెదురు చాటల తయారీనే జీవనాధారం. 40 ఏళ్లుగా ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు. గ్రామంలో 90 శాతం కుటుంబాలు చాటల తయారే బతుకుదెరువు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఎగుమతి చేసి లాభాలు గడిస్తున్నారు.

సర్పంచ్ కుటుంబానిదీ ఇదే వృత్తి

వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ గ్రామంలో మొత్తం 124 కుటుంబాలున్నాయి. ఇందులో 103 కుటుంబాలు చాటల తయారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గ్రామ సర్పంచ్ కుటుంబం సహా ఇదే వృత్తినే నమ్ముకుని జీవిస్తోంది. 20 ఏళ్ల క్రితం వరకు ఈ గ్రామ ప్రజలు తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న అడవుల్లోకి వెళ్లి వెదురు కర్రలు తెచ్చి వాటి ద్వారా చాటల తయారీ చేసి జీవించేవారు. తరువాత ఫారెస్టు అధికారులు అనుమతి నిరాకరించారు. ఆ సమయంలో పక్కనే ఉన్న పుత్తూరు పట్టణంలో కొంతమంది చాటల తయారీకి అవసరమైన వెదురు ముడిసరుకును కొనుగోలుచేసి చాటలు తయారు చేస్తున్నారు. ఇలా చేసిన చాటలను చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



వెత్తలతడుకులో కుటుంబ సభ్యులతో కలిసి చాటలు తయారు చేస్తున్న దశ్యం

చాటలలో రెండు రకాలు

చాటలలో రెండు రకాలు ఉంటాయి. పుత్తూరులో జత చాటలకు అవసరమయ్యే ముడిసరకు ధర రూ.80(చిన్నది), రూ.85(పెద్దది) చెల్లించి కొనుగోలు చేస్తారు. వాటిని చాటగా తయారు చేసి హోల్‌సేల్ వ్యాపారులకు జత రూ.130(పెద్దది), రూ.120(చిన్నది)కు విక్రయిస్తుంటారు. గ్రామాలకు తీసుకెళ్లితే రిటైల్ ధర రూ.170(పెద్దది), రూ.150(చిన్నది)కు అమ్ముతుంటారు.

తమిళుల సంప్రదాయ వస్తువు వెదురు

ప్రాచీన కాలం నుంచి తమిళులకు వెదురు చాట సంప్రదాయ వస్తువు. ఇంటి అవసరాలు, వ్యవసాయ అవసరాలు, అన్ని రకాల కార్యాలయాల్లో వెదురుచాటను వినియోగిస్తుంటారు. వ్యవసాయ ఒబ్బిళ్లకు, బియ్యం, చిరుధాన్యాలు శుభ్రం చేయడానికి చాటలు వాడుతుంటారు. ఇంటిని, పరిసరాలను శుభ్రం చేయడానికి కూడా వీటిని వినియోగిస్తారు. మానవ జీవితంలో చాట నిత్యావసర వస్తువే.



నారాయణవనం మండలం వెత్తలతడుకులో తయారు చేసిన చాటలను ఎండలో ఆరబెట్టుతున్న దశ్యం

రోజుకు రూ.500 పైనే

వెదురు చాటలు తయారీ ద్వారా రోజుకు రూ.500 వరకు సంపాదిస్తామని గ్రామ మహిళలు అంటున్నారు. ఇంట్లోనే ఇంటి పనులు చేసుకుంటూ చాటలు తయారు చేస్తామని చెబుతున్నారు. 12 ఏళ్ల పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ చాటల తయారీలో అరితేరి ఉంటారు. పాఠశాలకు సెలవు సమయాల్లో పిల్లలు సైతం తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా సహాయ పడుతుంటారు. మగవాళ్లు పెయింటింగ్ వంటి పనులకు వెళ్లగా.. ఆడవాళ్లు చాటల తయారీలో నిమగ్నమవుతుంటారు.

తమిళనాడు, పాండిచ్చేరికి ఎగుమతి

వెత్తలతడుకులో తయారయ్యే చాటలు తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఆ రెండు రాష్ట్రాల్లోని హోల్‌సేల్ వ్యాపారులు గ్రామానికి వచ్చి మొత్తంగా చాటలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. కొంతమంది చుట్టుపక్కల గ్రామాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

ప్రభుత్వం చేయూత

చాటల తయారుచేసే వెత్తలతడుకు వాసులకు వైఎస్ఆర్ ఆసరా, జగనన్న చేయూత, జగనన్న తోడు ద్వారా ప్రభుత్వ ఆర్థిక సాయం అందుతోంది. అలాగే సున్నా వడ్డీ, పీఎంఈజీపీ, శ్రీనిధి, బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్‌ల ద్వారా రుణాలు అందుతున్నాయి.



వెత్తలతడుకులో చాటలు తయారు చేస్తున్న మహిళలు

వృత్తిని వదల్లేం



మా ఇంట్లో అందరూ కలిసి చాటలు తయారు చేస్తుంటారు. వాటిని అమ్మగా వచ్చిన డబ్బులను కుటుంబ అవసరాలకు, పిల్లల చదువుకు, ఇతర ఖర్చులకు వాడుకుంటుంటాం. ఈ వృత్తిని వదులుకోవాలన్న ఆలోచన మాకు లేదు.

-అనిత

సెలవు రోజుల్లో సాయపడతారు



సెలవు రోజుల్లో పిల్లలు కూడా మాతో కలిసి చాటలు తయారీ చేస్తుంటారు. మేము ఎలాగో ఈ వృత్తిని వదులుకోలేం. మా పిల్లలైన పెద్ద చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడితే అదే చాలు.

-అరుణ

పథకాలు చేయూతనిస్తున్నాయి



ప్రభుత్వం అందించే రకరకాల పథకాలు చేయూతనిస్తునాయి. వాటి ద్వారా వచ్చే డబ్బును ఉపయోగించుకొని వృత్తిని మెరుగుపరుచుకుంటున్నాం. వాటివల్లే మేము ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నాం.

-వెళ్ళమ్మ

జనాలపైకి దూసుకెళ్లిన కారు

గూడూరురూరల్ : పట్టణంలోని నారాయణమ్మవీధిలో బుధవారం మధ్యాహ్నం ఓ కారు జనాలపైకి దూసుకెళ్లింది. డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా నడుపుతూ ఆ మార్గంలో వెళ్లే పాదచారులను ఢీకొట్టాడు. దీంతో పలువురు గాయపడ్డారు. స్థానికులు కారు డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తాపీ మేస్త్రీలకు బహుమతులు



మేస్త్రీలకు బహుమతులు అందిస్తున్న ఛాయాపతి

ఏర్పేడు : మండలకేంద్రలో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద బుధవారం తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ ఛాయాపతి బహుమతులు అందజేశారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 11 పంచాయతీ కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి వాడుతున్న భారతి సిమెంట్ నాణ్యతను పరిశీలించారు. సిమెంట్, ఇసుక, నీరు మిశ్రమాలను ఉపయోగించి క్యూరింగ్ పద్ధతిని తాపీ మేస్త్రీలకు వివరించారు. భవన నిర్మాణ కార్మికులకు భారతి సిమెంట్ వారి టీషర్ట్‌లు అందజేశారు. భారతి సిమెంట్ సుమతి ట్రేడర్స్ అధినేత మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం



కరికాలవలవన్, సిద్ధార్థ వీర వెంకటసుధీర్‌కుమార్, సీతారామరెడ్డికి స్వామి చిత్ర పటం ఇస్తున్న జేఈఓ వీరబ్రహ్మం



సిద్దివటం యానాదయ్య, బాలసుబ్రమణ్యన్ పళనిస్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డికి చిత్రపటం ఇస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా బుధవారం ఆరుగురు తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా రాష్ట్ర దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవలవన్, సభ్యులుగా వై.సీతారామిరెడ్డి, బాలసుబ్రమణియన్ పళనిస్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం యానాదయ్య, సిద్దా వీరవెంకట సుధీర్ కుమార్‌తో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. డాలర్ బాల సుబ్రమణ్యం కుటుంబ సమేతంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

అనాథల పిల్లలకు ఆశీర్వాదం



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న పిల్లలు

తిరుపతి అర్బన్: ఏర్పేడు ఎస్‌ఓఎస్ స్వచ్ఛంద సంస్థలోని పలువురు అనాథ పిల్లలు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు మిఠాయిలు తినిపించారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు పరేష్ ఉన్నారు.

గూడూరు ఫ్లైఓవర్ పనులు వేగవంతం

తిరుపతి అర్బన్ : గూడూరులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఓబీ ఫ్లైఓవర్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్మించాలని స్పష్టం చేశారు. 14 ఏళ్లుగా ఆగిన వంతెన పనులను నాణ్యతాప్రమాణాల మేరకు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం ఆర్అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు సమష్టిగా పనిచేయాలని కోరారు. సేకరించిన భూమిలో ఆక్రమణలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. సంబంధిత అంశాలపై కోర్టు సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. వంతెనతోపాటు అనుబంధ రోడ్ల నిర్మాణాలను సైతం పూర్తి చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ 2012లో ఫ్లై ఓవర్ నిర్మాణం ప్రారంభించినప్పటికీ అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించారని వెల్లడించారు. వంతెన పూర్తి చేస్తే గూడూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్పీడీసీఎల్ ఈఈ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



మంత్రి పెద్దిరెడ్డి దంపతులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈఓ



టీటీడీ చైర్మన్ భూమనకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఈఓ ఆహ్వానించారు. వారు బుధవారం ఆలయ అర్చకులు, వేద పండితులతో కలిసి తిరుపతిలోని మంత్రి నివాసంలో మంత్రి దంపతులను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సెప్టెంబర్ 18వ తేదీ చవితిరోజు నుంచి 21 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని, తప్పక రావాలని కోరారు.

టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డికి ఆహ్వాన పత్రిక

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు కోరారు. వారు బుధవారం భూమనను తిరుపతిలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.



రుయాకు వెళ్లే మార్గంలో నేలకొరిగిన వృక్షం



విష్ణు నివాసం దగ్గర వర్షపు నీరు

తిరుపతిలో మోస్తరు వర్షం

తిరుపతిలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. రామకృష్ణ డీలక్స్ నుంచి మహతి మీదుగా వెళ్లే రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. కొమ్మ మీద పడడంతో అక్కడ నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం దెబ్బతినింది. వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. అదేవిధంగా రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న విష్ణు నివాసం వద్ద రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

జింక అప్పగింత



గిరిజనుల సంరక్షణలో జింక

దొరవారిసత్రం : మండలంలోని కృష్ణాపురం కాలనీలోకి మంగళవారం రాత్రి ఓ జింక ప్రవేశించింది. కుక్కలు దాడి చేయబోగా స్థానిక గిరిజనులు కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు ఫారెస్ట్ సెక్షన్ అధికారి బాలయ్య, బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు వెంటనే జింకను పక్షుల కేంద్రంలోని జింకల పార్కుకు తరలించారు.

క్లుప్తంగా

ఖాతాదారులకు మెరుగైన సేవలు



పొదుపు సంఘాలకు రుణాలు అందజేస్తున్న సప్తగిరి బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్

తిరుపతి అర్బన్: సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. తిరుపతి నగరంలోని ఆర్‌సీ రోడ్డు ధనలక్ష్మి నగర్ రీజనల్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారుల్లో 50 శాతానికి పైగా మహిళలే ఉన్నారని పేర్కొన్నారు. వారికి ఎస్‌హెచ్‌జీ రుణాలు పెద్ద ఎత్తున ఇస్తున్నట్లు చెప్పారు. రాయలసీమ రీజియన్‌కు సంబంధించి 30 రోజుల్లో రూ.355 కోట్ల రుణాలు ఇచ్చామని, తిరుపతి రీజియన్ పరిధిలో 78 శాఖల్లో రూ.135 కోట్లు రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రీజియన్ మేనేజర్ జయకుమార్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

చంద్రగిరి: మండలంలోని పాతశానంబట్ల హరిజనవాడలో నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ కుంభాభిషేకాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సనాతన హైందవ ధర్మ వ్యాప్తి చేయడంతోపాటు మత మార్పిడులను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల గ్రామాల్లో ఆలయాలు నిర్మించేందుకు టీటీడీ–శ్రీవాణి ట్రస్ట్‌తో సమరత సేవా ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ(జనరల్) గుణభూషణ్ రెడ్డి, సమరత సేవా ఫౌండేషన్ తిరుపతి విభాగం కన్వీనర్ కుమారస్వామిరెడ్డి, జిల్లా కో కన్వీనర్ దామోదర్ రెడ్డి, జిల్లా ఆలయాల అకౌంటెంట్ మునిక్రిష్ణయ్య, చంద్రగిరి మండల కన్వీనర్ కెఆర్.గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



తిరుపతి అర్బన్: పౌర్ణమికి తిరువణ్ణామలై వెళ్లేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుపతి బస్టాండ్ కిటకిటలాడింది. రద్దీ ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. తిరుపతి జిల్లా నుంచి తిరుపతి మీదుగా 100 బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. తమిళనాడు ప్రభుత్వం 85 బస్సులకే అనుమతి ఇవ్వడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు.

నాయీబ్రాహ్మణలకు సముచిత స్థానం



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిద్దవటం యానాదయ్య

తిరుపతి కల్చరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య కొనియాడారు. ఆయన బుధవారం టీటీడీ బోర్డు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం నేతల ఆధ్వర్యంలో పద్మావతి అతిథి గృహం నుంచి అలిపిరి వరకు ర్యాలీ నిర్వహించారు. టీటీడీ చరిత్రలో నాయీ బ్రాహ్మణుడుకి బోర్డులో చోటు కల్పించడం చారిత్రాత్మకమని కొనియాడారు. ర్యాలీలో భాగంగా బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వామివారి పాదాలను నెత్తిన పెట్టుకొని కుటుంబ సభ్యులతో ప్రదక్షిణ చేశారు. గోప్రదక్షిణ మండపంలో గో పూజ చేసి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఎమ్మెల్యే తిప్పేస్వామికి స్వాగతం



తిప్పేస్వామికి స్వాగతం పలుకుతున్న దళిత, గిరిజన సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామికి బుధవారం పద్మావతి అతిథి గృహం వద్ద దళిత, గిరిజన నేతలు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు, ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్, డీవీఎంసీ సభ్యుడు మునీంద్ర నాయక్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు గౌడ్, గిరి, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రముఖ పర్యాటక ప్రాంతంగా సాగర్

- తిరునగరిలో మరో కలికితురాయి
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



వినాయక సాగర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: వినాయక సాగర్ ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అలరారనుందని టీటీడీ చైర్మన్ తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం అధికారులతో కలిసి వినాయక సాగర్‌తోపాటు అమ్యూజింగ్ పార్క్, ఐలాండ్, కిడ్స్ పార్క్ సముదాయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వినాయకసాగర్ తిరునగరిలో మరో కలికితురాయిగా నిలిచిపోనుందన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా సాగర్‌ను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, సెప్టెంబర్ 7వ తేదీన ప్రారంభించి నగరవాసులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇది వందల ఏళ్లుగా లింగాలమ్మ చెరువుగా ప్రసిద్ధి చెందిందన్నారు. 59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుకు వినాయక సాగర్‌గా నామకరణం చేసి ప్రజల సౌకర్యార్థం పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. సాగర్‌లోకి శుద్ధి చేసిన నీటిని విడుదల చేసేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వినాయక నిమజ్జనానికి ప్రత్యేక బ్లాక్‌ను అందుబాటులో ఉంచామన్నారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత వినాయక సాగర్‌లో అభివృద్ధి చేసిన బోటింగ్, కిడ్స్ పార్క్, ఐలాండ్, వాకింగ్ ట్రాక్, వంటి వాటి గురించి వివరించారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ అనీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాముల రమేష్‌రెడ్డి, లడ్డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన పాత్రధారితో గదాయుద్ధం చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్

చంద్రగిరి: స్థానిక పాతపేటలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్యోధన వధ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు ఘన స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అక్కడి నుంచి మోహిత్‌రెడ్డి భారతంమిట్టకు చేరుకున్నారు. దుర్యోధునుడి వేషధారితో కాసేపు గధాయుద్ధం చేసి ఆకట్టుకున్నారు. అనంతరం దుర్యోధునుడు, భీముడు యుద్ధ సన్నివేశాన్ని కళాకారులు రక్తికట్టించారు. దుర్యోధన వధ అనంతరం శిరస్సు వద్ద ఉన్న మట్టి కోసం భక్తులు పోటీపడ్డారు. రాత్రి అగ్నిగుండం ప్రవేశంతో మహా భారత ఉత్సవాలు ముగిశాయి. పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మస్తాన్, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

మోహన్ నాయుడికి నివాళి



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: ప్రభుత్వ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఎం.కొంగరవారి పల్లికి చెందిన సి.మోహన్ నాయుడు(55) బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి బుధవారం మోహన్‌నాయుడు భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి పాల్గొన్నారు.

హనుమంతునాయక్ కుటుంబానికి అభినయ్‌రెడ్డి పరామర్శ



హనుమంతునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంతునాయక్ మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళం రోడ్డులోని గోవింద ధామంలో బుధవారం హనుమంతునాయక్ శుభ స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హనుమంతునాయక్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్, గంగమ్మ ఆలయ బోర్డు సభ్యులు ధనశేఖర్, శివానాయక్ పాల్గొన్నారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

చంద్రగిరి: తొండవాడ పంచాయతీ అరుణకాలనీలోని బాల వినాయక గుడిలోని హుండీని మంగళవార అర్ధరాత్రి దుండగులు చోరీ చేశారు. స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన రేణిగుంట ఎయిర్‌పోర్టు అధికారులు



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న అధికారులు

తిరుపతి అర్బన్: రేణిగుంట ఎయిర్‌పోర్టు విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 3.40 ఎకరాలను అప్పగించడంపై విమానాశ్రయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎయిర్‌పోర్టు డైరెక్టర్ బసవరాజు, చీఫ్ సెక్యూరిటీ అధికారి రాజశేఖర్, డీజీఎం వెంకటరమణ కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీని కలిశారు. భూములు అప్పగించడంతో విశేషంగా కృషి చేశారని అభినందించారు.

ముగిసిన మహన్యాస రుద్రాభిషేకం



చెవిరెడ్డి లక్ష్మికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న శ్రీధర్ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని కామాక్ష్యాంబ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహన్యాస రుద్రాభిషేకాన్ని ఘనంగా చేపట్టారు. శ్రావణ మాసం సందర్భంగా మూడు రోజులుగా ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం ఆమెను వేద పండితులు ఆశీర్వదించారు. చైర్మన్ శ్రీధర్ రెడ్డి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,214 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,777 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 4.05 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

క్వాలిటీ కంట్రోలర్‌గా యాంటీ ప్లాగీరిజమ్ సాఫ్ట్‌వేర్

తిరుపతి సిటీ: పరిశోధనలో నాణ్యతా ప్రమాణాలను పెంచేందుకు యాంటీ ప్లాగీరిజమ్ డ్రిల్ బిట్ అనే నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపడుతున్నామని, ఇది సాఫ్ట్‌వేర్ క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తుందని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ డైరీ సైన్స్ డీన్ ప్రొఫెసర్ జే సురేష్ పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ లైబ్రరీలో బుధవారం నూతన సాఫ్ట్‌వేర్ ఇంప్లిమెంటేషన్‌పై అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశోధక విద్యార్థుల శోధనా పత్రాల నాణ్యతను పరీక్షించేందుకు సాఫ్ట్‌వేర్‌ను ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. నాణ్యత లేని పరిశోధనా పత్రాలు, ఆర్టికల్స్‌ను సాఫ్ట్‌వేర్ తిరస్కరిస్తుందన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ

పాకాల/చంద్రగిరి/భాకరాపేట: పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో పెళ్లి నిశ్చయమైన వధూవరులకు బుధవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు.



పాకాల: పెద్దగొర్పాడులో..



చంద్రగిరిలో..



చిన్నగొట్టిగల్లులో..



ఎర్రావారిపాళెంలో..

వధూవరులకు ఆశీర్వాదం



తిరుపతి మంగళం: తిరుపతి 50వ డివిజన్‌కు చెందిన మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య కుమార్తె వివాహం జరగనుంది. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్ ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తిరుపతి మంగళం: తిరుపతి 48వ డివిజన్ జీవికోనలో సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్, 48వ డివిజన్ అధ్యక్షుడు తలారి రాజేంద్ర భూమి పూజ చేశారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. నాయకులు మహ్మద్‌రఫీ, మహిళలు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై ఉక్కుపాదం

తిరుపతి తుడా: నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్టు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. ఆయన బుధవారం తిరుపతి నగరంలో ప్లాస్టిక్ విక్రయాలపై పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు పట్టుబడితే రూ.5 వేల నుంచి రూ.25 వేలు వరకు జరిమానా విధించి, దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సచివాలయంలో రక్షా బంధన్ వేడుకలు

పాకాల: పాకాల సచివాలయం–1లో బుధవారం సర్పంచ్ ఎస్.కస్తూరి ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా సచివాలయ సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ రాఖీలు కట్టారు. ఈఓ మోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను చేపట్టారు. విద్యార్థులు వర్సిటీ ప్రాంగణం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వీసీ జీఎస్ కృష్ణమూర్తి, ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఎంవేణు యాదవ్ ప్రారంభించారు. ఎల్ఐసీ, ఆఫీసర్స్ క్లబ్ ప్రాంతాల్లో విద్యార్థులు మొక్కలు నాటారు.

పీఈటీలకు శిక్షణ ఎంతో ఉపయోకరం

చంద్రగిరి: పీఈటీలకు రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ఎంతో ఉపయోకరమని ఎంఈవో లలిత కుమారి తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పీడీలు, పీఈటీలకు బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ప్రభాకర్ రావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి పీడీలతో కలిసి పాఠ్యప్రణాళిక జాబ్‌చార్ట్, కొత్తగా వచ్చిన యాప్‌లు, యోగాసనాలు, ఆటలలోని నిబంధనల గురించి చర్చించారు.

ఓటరు జాబితా సర్వే పరిశీలన

తిరుపతి కల్చరల్: నగరంలో చేపట్టిన ఓటరు జాబితా సర్వేను బుధవారం సాయంత్రం తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించారు. జీవకోనలో పలు ఇళ్ల వద్దకు వెళ్లి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలని, ఓటర్ల జాబితాలో పొరబాట్లు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

జీవో 107ను రద్దు చేయాలి

తిరుపతి కల్చరల్: దళిత, గిరిజన, బలహీన, మైనారిటీ పేద వర్గాలకు వైద్య విద్యను దూరం చేసే జీవో 107ను రద్దు చేయాలని ఏపీ బీసీ విద్యార్థి విభాగం జాతీయ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విధానాలతో రాష్ట్రంలో మెడికల్ సీట్లు అందే పరిస్థితి కరువైందన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో మంత్రి చెల్లుబోయిన

తిరుచానూరు(చంద్రగిరి): రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బుధవారం రాత్రి తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. అనంతరం ఆయన తిరుమలకు బయలుదేరి వెళ్ళారు. అదే విధంగా టీటీడీ బోర్డు సభ్యుడు సిద్ధవీర వెంకటసుధీర్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా సామూహిక శ్రావణ జంధ్యాల ఉపకర్మ

తిరుపతి కల్చరల్: శ్రావణ జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో కంచిమఠం ప్రాంగణంలో శ్రావణ సంధ్యాల ఉపకర్మ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. డాక్టర్ చక్రవర్తి రాఘవన్ మాట్లాడుతూ ఉపకర్మ విశిష్టతను వివరించారు. అనంతరం తిరుపతి బ్రాహ్మణ సమాజ ప్రముఖుడు చంద్రమౌళీశ్వర గురుకుల్ నగరంలోని బ్రాహ్మణులకు శాస్త్రోక్తంగా ఉపకర్మ చేపట్టారు.

ఇల్లు ఇప్పించి న్యాయం చేయండి

తిరుపతి కల్చరల్: కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన ఇంటిని ఇప్పించి న్యాయం చేయాలని ఎన్ఆర్ఐ సాయిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి పాదాల చెంత ఇల్లు కట్టుకోవాలని రేణిగుంట మండలం కొత్రమంగళం వద్ద నిర్మిస్తున్న బహుళ అంతస్తుల్లో ఓ ఇంటిని రూ.30 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశానని తెలిపారు. నాలుగు నెలలు గడుస్తున్నా సంస్థ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఇలా 250 మందికి కూడా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పడిపోయిన మంగళం ఆర్టీసీ డిపో ప్రహరీగోడ

తిరుపతి అర్బన్: తిరుపతి మంగళం ఆర్టీసీ డిపో ప్రహరీగోడ బుధవారం కూలిపోయింది. గతంలో కురిసిన వర్షాలతో కొంత మేరకు దెబ్బతింది. నాలుగురోజులుగా అప్పుడప్పుడు వర్షం కురుస్తుండడంతో గోడ కూలిపోయింది. గోడకు మరమ్మతులు చేయిస్తామని డిపో మేనేజర్ భాస్కర్ వెల్లడించారు.

పాఠ్యాంశంపై ఉపాధ్యాయులకు అవగాహన ఉండాలి

పాకాల: పిల్లలకు బోధించే పాఠ్యాంశంపై ప్రతి ఉపాధ్యాయుడూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో బాబ్జీ తెలిపారు. ఆయన బుధవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

తిరుపతి క్రైం: నగరంలోని కొర్లగుంటల్లో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. కొర్లగుంటకు చెందిన పుష్ప(37) భర్త మూడేళ్ల క్రితం కరోనాతో మృతి చెందారు. ఆమె చంద్రగిరి మండలం నర్సింగాపురానికి చెందిన దిలీప్‌తో సహజీవనం చేస్తోంది. అతను తమిళనాడు నైవేలిలోని టీటీడీ కల్యాణమండపంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 25న నైవేలిలో వీరి మధ్య గొడవ జరిగి పుష్ప గాయపడింది. 26న తిరుపతి వచ్చి ఆస్పత్రిలో చేరింది. 27న చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై మృతురాలి అన్న మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





భూమనను సత్కరిస్తున్న సుబ్బరాజు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ సోదరీమణులు

టీటీడీ చైర్మన్‌కు సత్కారం

తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని బుధవారం పలువురు ప్రముఖులు కలిశారు. ఆయనను శాలువాలు కప్పి సత్కరించారు. వారిలో టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సుబ్బరాజు, ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ యోగేష్ డుమ్రాకోటి, ఎస్ఈఈడీఏపీ చైర్మన్ ఎస్.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

టీటీడీ చైర్మన్‌కు రాఖీ

రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి పద్మావతిపురంలోని ఆయన నివాసంలో బ్రహ్మకుమారీస్ సోదరీమణులు రాఖీ కట్టారు.

వేడుకగా కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం



కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం సందర్భంగా పూర్ణాహుతి చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా బుధవారం కల్యాణ కామేశ్వరి మంత్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశాల మేరకు పెళ్లి కాని వారికి పెళ్లి గడియలు సమకూర్చేందుకు గంగమ్మ ఆలయంలో తొలిసారి కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం చేపట్టారు. సుమారు వంద మందికి పైగా పెళ్లి కాని పాల్గొన్నారు. పూర్ణాహుతితో కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం పరిసమాప్తమైంది. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య మాట్లాడుతూ పెళ్లి కాని వారి కోసం ప్రతి నెలా కల్యాణ కామేశ్వరి హోమం చేపట్టనున్నట్లు తెలిపారు. తుడా కార్యదర్శి లక్ష్మీ, ఆలయ కమిటీ సభ్యులు టి.రమణమ్మ, వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మించిన డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో, వినాయక సాగర్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె బుధవారం అధికారులతో అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్షించారు. శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం వచ్చే నెల 18న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఆడిటోరియం, వినాయక సాగర్‌నూ ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో పెండింగులో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాల సుబ్రమణ్యం, డీఈఈలు విజయకుమార్‌రెడ్డి, దేవిక, మోహన్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

